క్లుప్తంగా

ఉద్యానవన విస్తరణాధికారిగా అనిల్



బాధ్యతలు స్వీకరిస్తున్న వంగూరి అనిల్

నడిగూడెం : ఉద్యానవన నడిగూడెం, మునగాల, మోతె మండలాల విస్తరణాధికారిగా వంగూరి అనిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. మూడు మండలాలలో ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీడీఓ

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడు పొడపంగి లక్ష్మీనారాయణ దశదిన కర్మను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఆంజనేయులు, పారిశుద్ధ్య కార్మికులు, రావిపహాడ్ మాదిగ బలగం యువకులు పాల్గొని లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి మండల పారిశుద్ధ్య కార్మికులు రూ.20 వేలు, మండల పంచాయతీ కార్యదర్శులు రూ.10 వేలు, రావిపహాడ్ మాదిగ బలగం యువకులు రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు.రావిపహాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మునగాల : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, రైతు సంఘం మండల అధ్యక్షుడు చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, బి.కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, వెంకటాద్రి, పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 22, 23 తేదీల్లో నేరేడుచర్ల మండల పాఠశాలల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి పుట్లూరి సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన అండర్ -14 బాలురు, అండర్- 17 బాలికల జట్లు, 23వ తేదీన అండర్-14 బాలికలు, అండర్-17 బాలుర జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14కు 2012 జనవరి 1, అండర్- 17కు 2009 తరవాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులను క్రీడా ఎంపిక కోసం పంపించాలని కోరారు.

రక్తదాత బాబానాయక్‌కు పద్మశ్రీ చక్ర అవార్డు



పద్మశ్రీ చక్ర అవార్డు అందజేసి సన్మానిస్తున్న బాబుమోహన్, మధుసూదనాచారి

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం గారకుంటతండాకు చెందిన సామాజికవేత్త, రక్తదాత గుగులోతు బాబానాయక్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సినీ నటుడు బాబుమోహన్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా బుధవారం పద్మశ్రీ చక్ర అవార్డు అందుకున్నారు. బాబానాయక్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో పోలీస్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఒకే సంవత్సరంలో 28సార్లు రక్తదానం చేయడమే కాకుండా.. వాట్సాప్ గ్రూపుల ద్వారా 1000 మందికి రక్తం ఇప్పించారు. ఆయన సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ చక్ర అవార్డు వరించింది.

సామాజిక విలువలు పెంపొందించుకోవాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు సామాజిక విలువలు పెంపొందించుకోవాలని ఎంపీడీఓ లావణ్య, ఎంఈఓ సైదానాయక్, హరిత ఫౌండేషన్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ కేశవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ మై వాయిస్ ఆధ్వర్యంలో మండల స్థాయి డిబేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజేతలకు, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు మెమొంటోలు, పుస్తకాలు అందజేశారు. ఉత్తమ టీచర్ ఆర్.అన్వేష్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడువాయిలో జ్వరాల విజృంభణ

- గ్రామంలో పారిశుద్ధ్య లోపం
- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- పల్లెదవాఖానాతో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరపీడితుల క్యూ
- ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



తాడువాయిలోని ఓ వీధిలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు నీరు వీధుల్లో నిలుస్తుంతడడంతో దోమలబెడద ఎక్కువైంది. దీంతో గత వారం రోజులుగా ప్రజలు విషజ్వరాల బారిన పడి నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే సుమారు 10 మందికి పైగా విషజ్వరాల బారిన పడినట్లు సమాచారం. దీంతో గ్రామంలో గత వారం రోజులుగా రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మకాం వేసి ప్రజలకు అవగాహన కల్పించడమే కాక, దోమల నివారణ చర్యలను ముమ్మరంగా చేపడుతున్నారు. స్థానికంగా ఉన్న పల్లెదవాఖానాలో వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి జ్వర పీడితులను గుర్తించి వైద్యం అందిస్తున్నారు. పలువురు జ్వరపీడితులు కోదాడ, మునగాలలోని పలు ప్రైవే టు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పారిశుద్ధ్యం లోపంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయని వైద్య సిబ్బంది తెలిపారు.

మురుగు కాలువలు శుభ్రం చేయిస్తున్నాం

గ్రామంలో నెల రోజులుగా వారానికి రెండు సార్లు మురుగుకాలువలను శుభ్రం చేయిస్తున్నాం. మురుగుకాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు సీసీ రోడ్లపైకి వస్తోంది. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.

– రాము, గ్రామపంచాయతీ కార్యదర్శి

అధ్వానంగా మురుగు కాలువలు..

గ్రామంలోని వీధుల్లో మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడమే కాక దోమల వ్యాప్తి ఉధృతంగా ఉంది. సీసీ రోడ్లపై వర్షపునీరు, మురుగు నిల్వ ఉండి కనీసం నడిచే వీలులేకుండా పోయింది. కొన్ని వీధుల్లో కొంతమంది మురుగునీరు వెళ్లకుండా రాళ్లు అడ్డం వేయడం సమస్యగా మారింది. మురుగు కాలువలు శుభ్రం చేసినప్పటికీ మురుగునీరు పూర్తిస్థాయిలో ప్రవహించడం లేదు.

వీధుల్లో మురుగు పారుతోంది



గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు వీధుల్లో పారుతోంది. అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థను సరిజేయాలి. గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలి.

– కోల ఆంజనేయులు, బీసీ సంఘం నాయకుడు,తాడువాయి

చికిత్స అందిస్తున్నాం



గ్రామంలో సాధారణ జ్వరాలు వస్తున్నాయి. ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితులను గుర్తిస్తున్నాం. జూలై, ఆగస్టు మాసాలలో 5 డెంగ్యూ కేసులు నమోదు కాగ ప్రస్తుతం రెండు యాక్టివ్‌గా ఉన్నాయి. మురుగు కాలువలలో, వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేయించాం. పల్లెదవాఖానాలో జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. సకాలంలో వైద్యచికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ వైష్ణవి, పల్లెదవాఖానా వైద్యాధికారి, తాడువాయి

పరిశోధనలు చేసి.. డాక్టరేట్ పొంది



మఠంపల్లి : తల్లిదండ్రులతో పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఉండేటి స్రవంతి



నేరేడుచర్ల : తల్లిదండ్రులతో అనిత

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన ఉండేటి ప్రభు కుమార్తె స్రవంతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. తెలంగాణ దాస సాహిత్యం అనే అంశంపై యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు సాగి కమలాకర్‌శర్మ పర్యవేక్షణలో చేసిన పరిశోధన గాను డాక్టరేట్ లభించింది. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణన్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను ఆమె అందుకున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని జగద్గిరిగుటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి..

నేరేడుచర్ల : మండల కేంద్రానికి చెందిన అమరవరపు అనితకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ది లైబ్రరీ మూమెంట్ ఇన్ తెలంగాణ (1901-1948) అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈనెల 19వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంది. అనిత నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలిగా పని చేస్తోంది. ఆమె తండ్రి అమరవరపు కొండల్ నేరేడుచర్ల మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



నడిగూడెంలో మాట్లాడుతున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి

నడిగూడెం : గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం మునగాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన గణేష్ ఉత్సవాల నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ వి.సరిత, ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్, విద్యుత్ శాఖ లైన్‌మెన్ కాసాని శ్రీను పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

నడిగూడెం : ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందృంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చట్టాల అమలు, జైలు శిక్షలు, వ్యక్తుల సత్ప్రవర్తన, తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గందమళ్ల అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలి

కోదాడరూరల్ : కొత్త పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేయించాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవి ఆర్పీలకు సూచించారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వీధి విక్రయదారులు, వికలాంగుల సంఘాల ఏర్పాటు చేసి వారికి అవసరమైన రుణాలను అందజేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఓ వెంకన్న, సీఎల్ ఆర్పీలు, ఆర్పీలు, టీఎల్ఎఫ్, ఓబీలు పాల్గొన్నారు.

టీ సేఫ్ యాప్‌పై అవగాహన

కోదాడరూరల్ : టీసేఫ్ యాప్‌పై విద్యార్థులు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని కొమరబండ ఉన్నత పాఠశాలలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎం గోవిందయ్య, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ కవిత, సాయిజ్యోతి, నాగేంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

హుజూర్‌నగర్ : ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ బొబ్బ పద్మ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం 5 పరిధిలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్ఎంలు లలిత, ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజని, ఆశా వర్కర్లు సుజాత, జ్యోతి, సుశీల, నిర్మల, కారింగుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

నడిగూడెం : మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బహుజన సామాజిక ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుండు విజయరామారావు, నాయకులు గుండు లింగరాజు, గుండు మహీందర్‌గౌడ్, ఎస్.ఆర్.శ్రీను, గద్దం సాంభశివరావు, నాగబ్రహ్మాచారి, వీరాచారి, కాసాని శ్రీను, లాల్ బేగ్, కాసాని వెంకటనారాయణ, తుమ్మల సైదులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయనాయక్

నడిగూడెం : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయ నాయక్ కోరారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిరి ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 60 ఏళ్లుగా రసాయన ఎరువులు వాడుతూ వ్యవసాయం చేపడుతుండడంతో భూసారం దెబ్బతింటోందని, ఆ పంటను ఆహారంగా తీసుకుటుండడంతో వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. మనతో పాటు, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. వ్యవసాయ భూమి లేని వారు ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచుకోవాలన్నారు. అనంతరం పలు రకాల చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మొలుగూరి గోపయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.జానిపాషా, కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు ఉపేందర్, మహేష్, ధనుంజయ్, వీరన్న, రజిత, తేజశ్రీ, శైలజ, మణి, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిగూడెంలో పారిశుద్ధ్య చర్యలు

నడిగూడెం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నడిగూడెం మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. బుధవారం పలు ప్రధాన వీధులు, డ్రెయినేజీల్లో దోమల లార్వాను నాశనం చేసే టీమోఫాస్ మందు పిచికారీ చేశారు. పలు వీధుల్లో బ్లీచింగ్ పౌడరు చల్లారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి చంద్రశేఖర్‌రాజు, పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే రూ.5 వేలకు పైగా జరిమానా

హుజూర్‌నగర్ : దుకాణాలు, హోటళ్లలో నిబంధనలు పాటించకుంటే ఇక నుంచి రూ. 5 వేలకు పైగా జరిమానా విధిస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు టిఫిన్, భోజన హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించని ఒక టిఫిన్ సెంటర్‌కు రూ.500 జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ జవాన్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు శునకానికి కర్మకాండలు



పెంపుడు శునకం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సామియేలు కుటుంబ సభ్యులు

మునగాల: తమ కుటుంబంలో ఒకడిగా కలిసిపోయిన పెంపుడు శునకం మృతిచెందగా.. దానికి కర్మకాండలు నిర్వహించి తమ ప్రేమను చాటుకున్నారు మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన ఓ కుటుంబం. వివరాలు.. బరాఖత్‌గూడేనికి చెందిన కాలే సామియేలు, జయమ్మ దంపతులు 14 ఏళ్ల క్రితం ఓ శునకాన్ని తెచ్చుకొని దానికి లక్కీ అని పేరు పెంచుకున్నారు. ఆ శునకం వారి ఇంట్లో ఓ కుటుంబ సభ్యుడిగా మారిపోయింది. కాగా ఆదివారం ఆ శునకం అనారోగ్యానికి గురై మృతిచెందింది. దీంతో తమ ఇంట్లో ఓ కుటుంబ సభ్యుడు చనిపోయినట్లుగా భావించిన సామియేలు కుటుంబ సభ్యులు దానిని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అంతేకాకుండా బుధవారం సామియేలు కుటుంబ సభ్యులు తమ నివాసంలో బంధుమిత్రులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శునకం చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పింఛన్లు పెంచాలి

కోదాడరూరల్ : వికలాంగుల పింఛన్‌ను రూ.6వేలకు, చేయూత పింఛన్లను రూ.4వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూర వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31 కోదాడ పట్టణంలోని ఆర్‌ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల, చేయూత పింఛన్‌దారుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఏపూరి రాజు మాదిగ, కర్ల విజయరావు, కొత్తపల్లి అంజయ్య, రావి స్నేహలతచౌదరి, పాతకొట్ల నాగరాజు, యాతాకుల యల్ల య్య, వెంకన్న, కృష్ణ, నాగేశ్వరరావు, గుర్వయ్య, కుటుంబరావు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న డీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన విద్యార్థులు కోలపూడి శ్రీమాన్, పంగ శ్యామ్‌కుమార్, కోలపూడి తమన్‌లు తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాల 4వ తరగతిలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం హుజూర్‌నగర్‌లో డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి కవిత, బాబురావు, స్థానిక నాయకులు శీలం శ్రీను, నాగమణి, కోలపూడి చంటి, శ్రీనాథ్, సుజాత, నరసింహారావు, రమాదేవి, శ్యామ్ నాగవేణి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలుకూరు : మండలంలోని బేతవోలు సబ్‌స్టేషన్ పరిధిలో గల బేతవోలు ఫీడర్‌లో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నందీశ్వరుడికి పంచామృతాభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం బహుళ త్రయోదశి పర్వదిన సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన, మహానివేదన, మంగళనిరాజనం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ప్రదోష సమయంలో నందీశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ శాఖ కమిషనర్ కె.భాస్కర్‌శర్మ, ఆలయ మేనేజర్ ఎస్.శంభిరెడ్డి, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, సిబ్బంది కొండారెడ్డి, నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిప్రదాత రాజీవ్ గాంధీ



హుజూర్‌నగర్ : రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : యువతకు స్ఫూర్తిప్రదాత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ రావు, టీపీసీసీ ప్రతినిధి దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దొంతగాని శ్రీనివాస్, ఎండీ అజీజ్ పాషా, జక్కుల మల్లయ్య, గల్లా వెంకటేశ్వర్లు, కె.మహేష్, ఎస్.సుబ్బరాజు, కె.యోహాన్, వై.వీరబాబు, ఎస్‌కె.సైదా, వి.కృష్ణ, ఎం.ముక్కంటి, మజీద్, మన్సూర్ అలీ, టి.సైదులు, ఎం.సత్యనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, మట్టయ్య, రామారావు, శివ, శ్రీనివాస్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నేరేడుచర్ల : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం నేరేడుచర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, యామిని వీరయ్య, చింతమళ్ల సైదులు, ఆకారపు వెంకటేశ్వర్లు, కొణతం రాంరెడ్డి, అజయ్, సత్యనారాయణ, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, శ్రీను తదితరులు ఉన్నారు.

మునగాల : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 78వ జయంతిని బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, మట్టయ్య యాదవ్, సైదులు, గిరి, మీసేవ శర్మ, శ్రీను, గోపి, అప్పారావు, ఈదారావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు 'మైహోం' సాయం



ఎస్పీ నరసింహకు చెక్కు అందజేస్తున్న మైహోం పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

మఠంపల్లి : మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ తరపున రూ.5లక్షల చెక్కును బుధవారం పరిశ్రమ యూనిట్ హెడ్ ఎస్ శ్రీనివాసరావు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అంతరాష్ట్ర సరిహద్దు మట్టపల్లి చెక్‌పోస్టుతో పాటు హుజూర్‌నగర్- మట్టపల్లి ప్రధాన రహదారిపై గల బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి, మట్టపల్లి తదితర గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు, మైహోం సిమెంట్స్ జీఎం శ్రీరామ్, ఏజీఎం శ్రీనివాస్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నడిగూడెం : కరివిరాల మోడల్ స్కూల్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మన్నెం వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీరావలి అన్నారు. ఈమేరకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించబోయే మహా ధర్నా పోస్టర్‌ను బుధవారం హుజూర్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వాలను నమోదు చేశారు. కార్యక్రమాలలో పీఆర్‌టీయూ మండలం అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంకతి శ్రీనివాస్, నాయకులు కొప్పుల బ్రహ్మరెడ్డి, సిరికొండ వెంకటయ్య, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా సత్యనారాయణ, వేణు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

1న పీఆర్‌టీయూ టీఎస్ మహాధర్నా

నడిగూడెం : సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సామినేని శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్, కాగితరామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో ధర్నా వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు బానోతు నాగేశ్వరరావు, కార్యదర్శి మీసాల కోటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బత్తిని గోపి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కొల్లు నాగేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయం

మేళ్లచెరువు : నేరారోపణలతో అరెస్టయి 30 రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉండే ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు తమ పదవి కోల్పోయేలా కేంద్రం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టడం హర్షణీయమని బీజేపీ చింతలపాలెం మండల అధ్యక్షుడు పత్తిపాటి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రాకేష్

మేళ్లచెరువు : ఎమ్మార్పీఎస్ చింతలపాలెం మండల అధ్యక్షుడిగా మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన గొల్లపూడి రాకేష్ మాదిగ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా పెద్దపొంగు శ్రీను ఎన్నికయ్యారు. బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇరువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఏపూరి రాజు, బాలచంద్రుడు, ఆరోన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌కు సన్మానం

నడిగూడెం : ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ తహసీల్దార్‌గా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న నడిగూడెం తహసీల్దార్ వి.సరితను బుధవారం సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కాసాని కిషోర్, యల్లయ్య, కేశగాని భద్రయ్య, హనీఫ్, సెదాహుస్సేన్, అంజి పాల్గొన్నారు.

రుణం చెక్కు అందజేత

నడిగూడెం : సహకార సంఘాలు అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగితరామచంద్రాపురం పీఏసీఎస్ చైర్మన్ గోసుల రాజేష్ కోరారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘంలో సభ్యురాలైన గుండు శిరీషకు ఎనిమిది లక్షల రూపాయల దీర్ఘ కాలిక రుణం చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఈఓ సీహెచ్.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

గరిడేపల్లి : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కె నాగుల్, జానీ, కమలమ్మ, అలీ, వాసు, నర్సయ్య, సైదులు, పావని, సైదాబి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

గరిడేపల్లి : పేద విద్యార్థుల ఆరోగ్యం కోసం దాతలు సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు సువర్ణ అన్నారు. గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పిడమర్తి అంజి, ప్రశాంతి బుధవారం ప్యూరీఫయర్ వాటర్ అందజేశారు. విద్యార్థులకు ఒక సంవత్సరం పాటు రూ. 25వేల విలువ గల ప్యూరీఫయర్ వాటర్ అందించనున్నట్లు పిడమర్తి అంజి, ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, అంబేద్కర్, మంగమ్మ, పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మకు బోనాలు

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ జాతరలో భాగంగా గురువారం కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. రైతులు ప్రభబండ్లను అందంగా అలంకరించి తమ ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై కట్టి మేళతాళాలతో పురవీధులలో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేస్తారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలతో క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు.

యూరియా కొరతను నివారించాలి

మునగాల : జిల్లాలో యూరియా కొరతను నివారించాలని మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని నాలుగు సొసైటీల్లో రైతులకు సరిపడా యూరియాను నిల్వచేసి ఎమ్మార్పీకి విక్రయించాలని ఆయన కోరారు.